ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి శోభ...

సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అంటారు. వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం గుండా భగవంతుడ్ని దర్శించుకుంటే ముక్తి, మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. మహావిష్ణువు మూడుకోట్ల మంది దేవతలతో గరుడ వాహనంపై భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనిమస్తాడు కాబట్టే స్వామి దర్శనానికి సోమవారం వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. విజయనగరం మండలంలోని రామానారాయణంలో అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే శ్రీక్షేత్రమ్‌లో అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అర్చకులు శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమన్నే, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని తోటపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిహారం రంగాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించగా, ఏర్పాట్లను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీఎస్. సూర్యభగవాన్ పర్యవేక్షించారు. రింగ్ రోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కంటోన్మెంట్ అరుంధతీనగర్‌లో వైభవ వేంకకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లను వివిధ రకాల పుష్పాలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు రాజేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. బాబామెట్ట ఏడుకోవెళ్లలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేపీపీ రాజు, శివకుమార్, కోశాధికారి సాంబమూర్తిరాజు తదితరుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, తిరువీధి చేపట్టారు. డెంకాడ మండలం చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ వద్దనున్న కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామి వారి తిరువీధి కనులపండువగా నిర్వహించారు.

– విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం టౌన్: ప్రత్యేక అలంకరణలో ఉన్న అరుంధతీనగర్‌లో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి


విజయనగరం టౌన్: తోటపాలెంలో కొలువైన స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


విజయనగరం టౌన్: బాబామెట్ట ఏడుకోవెళ్లలో స్వామివారి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు


రింగ్‌రోడ్ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


విజయనగరం టౌన్: తోటపాలెం వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠం ద్వారం మీదుగా దర్శనం చేసుకుంటున్న భక్తులు


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


విజయనగరం టౌన్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు


విజయనగరం రూరల్: రామనారాయణంలో ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు


డెంకాడ : ఏపీఎస్పీ బెటాలియన్ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో తిరువీధి


విజయనగరం రూరల్: శ్రీక్షేత్రమ్‌లో దేవతామూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

మిల్లర్ల దోపిడీ అరికట్టాలి


ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, అక్రమంగా వసూలు చేసే డబ్బులు తిరిగి ఇప్పించాలని ఏపీ రైతు సంఘ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జామి, ఎం. కొత్తవలస, గొట్లాం, తానవరం, రొంపల్లి, తదితర గ్రామాల రైతుల నుంచి మిల్లర్లు తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, శిరికి శ్రీరామ్మూర్తి, చలుమూరి మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు కనిమెల్ల విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కనిమెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. షాట్‌పుట్ అండర్–14 విభాగంలో డి. రామలక్ష్మి, జావెలిన్ త్రో అండర్–17 విభాగంలో వై. మౌనిక ఎన్నికైనట్లు హెచ్‌ఎం బలగ పాపినాయుడు తెలిపారు. జనవరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వీరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మావతినగర్, ప్రదీప్‌నగర్, వసంతవిహార్, ధర్మపురి, ఎస్‌వీఎన్ నగర్, బియ్యాలపేట, నోబుల్‌నగర్, కొత్త ధర్మపురి, కమలనగర్, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 6 వరకు అమృతసర్‌లోని గురునాయక్‌దేవ్ యూనివర్సిటీలో జరగబోయే పోటీలకు ఎస్.హరికృష్ణ, ఎం.గగన్‌సాగర్, వై.భార్గవి ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు శనివారం తెలిపారు. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అలరించిన కచేరి


గాత్రకచేరీ నిర్వహిస్తున్న, తమ్మిన షణ్ముఖ ప్రియ

విజయనగరం టౌన్: పట్టణంలోని తెలకలవీధి రామమందిరం ఆవరణలో సోమవారం రాత్రి జరిగిన పట్టణానికి చెందిన తమ్మిన షణ్ముకప్రియ శాస్త్రీయ సంగీత కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామిపై చిన్నారి పాడిన పాటలు భక్తులను విశేషంగా అలరించాయి. వయోలిన్‌పై రవికుమార్, మృదంగంపై శ్రీనివాస్ సహకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి


సచివాలయ ప్రతినిధులతో మాట్లాడుతున్న రామకృష్ణ

విజయనగరం: విద్యార్థినులు రక్తహీనతను అధిగమించేలా అవగాహన కల్పించాలని సామాజిక, పరివర్తన, మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ తెలిపారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు పట్టణంలోని 47, 48 సచివాలయాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యదర్శి పరిధిలో ఎన్ని పాఠశాలలున్నాయి, ఆయా పాఠశాలల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెహర్, నిషా తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణకు తరలిరండి


మాట్లాడుతున్న బీసీ సంఘ నేతలు ఎస్‌వీవీ రాజేష్, ముద్దాడ మధు, తదితరులు

విజయనగరం/విజయనగరం రూరల్: కలెక్టరేట్ జంక్షన్‌లో మంగళవారం ఏర్పాటు చేయనున్న సావిత్రీబాయి పూలే విగ్రహావిష్కరణకు పార్టీలకతీతంగా బీసీలందరూ తరలి రావాలని బీసీ సంఘ నాయకులు ముద్దాడ మధు, ఎస్‌వీవీ రాజేష్, పిన్నింటి కళావతి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ జంక్షన్ వద్దనున్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, ఆరు నెలల కిందట బీసీ నేతలందరూ సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సంప్రదించారన్నారు. దీనికి ఆయన స్పందిస్తూ జ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే సావిత్రీబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. పూలే జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆవిష్కరిస్తారన్నారు. నియోజకవర్గంలోని బీసీ కుల సంఘాలన్నీ వారి బ్యానర్లతో మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకల్లా పాత వెంకటలక్ష్మి థియేటర్ వద్దనున్న సీఎంఆర్ జంక్షన్ వద్దకు చేరుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంఘ నేతలు, కార్పొరేటర్లు మీసాల రమాదేవి, సుంకరి నారాయణరావు, వింత ప్రభాకరరెడ్డి, పట్నాన పైడిరాజు, కో ఆప్షన్ సభ్యులు రహీం, బీసీ సంఘ నాయకులు ఇసరపు రామకృష్ణ, కాళ్ల సూరిబాబు, పిన్నింటి సూర్యనారాయణ, తోనంగి జగన్నాథరెడ్డి, లంక మహేష్, తొగరోతు అప్పలనాయుడు, బాలి ప్రతాప్, బొద్దూరు లక్ష్మణరావు, జామి సూరిబాబు, లంక మధు, పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమిలి, కనిమెల్ల, కొప్పెర్ల, చౌడువాడ గ్రామాలలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరో తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆదిభట్ల వర్ధంతి

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 78వ వర్ధంతిని శ్రీ ఆదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదిభట్ల మనుమరాలు కామేశ్వరమ్మ నారాయణదాసు విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం దాసు మునిమనవడు ఆనందనారాయణదాసు మాట్లాడుతూ, ఆదిభట్ల హరికథకు జీవం పోసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఆదిభట్ల కుటుంబ సభ్యులు మంజూష, పద్మనాభం పాల్గొన్నారు.

అఖిల భారత శిష్టకరణ సంఘ సంయుక్త కార్యదర్శిగా ఈశ్వరరావు

విజయనగరం టౌన్: అఖిల భారత శిష్టకరణ సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎంపీజీ ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలి జరిగిన ఆల్ ఇండియా శిష్టకరణ సంఘ వర్చువల్ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్లు సంఘ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును పలువురు అభినందించారు.

బియ్యం ఉచితం..

భోగాపురం: నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా మండలంలోని 18,349 మంది కార్డుదారులకు ఈ నెల బియ్యం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 32 డిపోల్లో ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. పంచదార, కందిపప్పులకు మాత్రం యథావిధిగా డబ్బులు వసూలు చేస్తారన్నారు.

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

నెల్లిమర్ల: చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యానికి అంగన్‌వాడీ సిబ్బంది ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. మండలంలోని రామతీర్థం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కేంద్రానికి సరఫరా అవుతున్న కోడిగుడ్లను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలించి, తక్కువ బరువుండే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను అతికించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్లు శకుంతల, జ్యోతి, తదితరులున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా స్థానిక ఆలయంలోని సీతారామ స్వామివారిని దర్శించుకున్నారు.

పింఛన్ పెంపుతో జీవన ప్రమాణాలు మెరుగు


పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు అందిస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని పెంచడంతో అవ్వాతాతల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉన్న ప్రచార పిచ్చికి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. వాస్తవానికి చంద్రబాబే రాష్ట్రానికి చీడపురుగని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు రూ.2500 ఉన్న పింఛన్‌ను 2750 రూపాయలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మందిని ఆదుకుంటున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలు, గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. 'మనబడి నాడు – నేడు'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయికి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంతో పాటు అమ్మఒడి పథకం ద్వారా ఆర్థికసాయం కూడా అందజేస్తున్నామన్నారు. గతంలో ఒక పింఛన్ మంజూరు కావాలంటే పనికి మాలిన జన్మభూమి కమిటీలు ఆమోదిస్తే తప్ప ఇచ్చేవారు కాదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, డెంకాడ, పోలిపల్లి సొసైటీ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న హమాలీలు

విజయనగరం ఫూల్‌బాగ్: సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై హమాలీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. కామేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 సంవత్సరాలుగా సివిల్ సప్లై కార్పొరేషన్ ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద కలాసీలుగా పనిచేస్తూ, ప్రభుత్వం ఇస్తున్న నిత్యావసర సరుకులను ప్రజలకు సకాలంలో అందిస్తున్నప్పటికీ వీరికి న్యాయం జరగడం లేదన్నారు. 2022 జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త కూలి రేట్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు ఇవ్వడం లేదన్నారు. అనేకసార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

మహిళా విద్యాప్రదాత సావిత్రిబాయి పూలే

విజయనగరం ఫూల్‌బాగ్:

సావిత్రిబాయి పూలే 192వ జయంతి సోమవారం స్థానిక 46వ డివిజన్ పరిధిలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ మాట్లాడుతూ, మహిళలకు విద్య నేర్పేందుకు కృషి చేసిన తొలి గురువు సావిత్రిబాయి పూలే అని అన్నారు. అటువంటి విద్యా ప్రదాత స్ఫూర్తితో ఐద్వా మహిళా సమస్యలపై పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ సమతా జిల్లా కన్వీనర్ జి.నిర్మల, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణమ్మ

మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరం


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, తదితరులు

విజయనగరం క్రైమ్: సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక దుర్వసనాలలో మాదకద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమైనదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ఐ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్, నల్లమందు వంటి వాటికి అలవాటు పడి విద్యార్థులు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత పెడదారి పట్టకుండా వారి నడవడికలో మార్పులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. యువత అధిక డబ్బులకు ఆశపడి డ్రగ్స్ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి హాని కలిగించే ఈ డ్రగ్స్ రవాణా గురించి టోల్ ఫ్రీ నంబర్ 14500కి సమాచారం అందించాలన్నారు. అనంతరం కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ మహిళా పోలీస్ భార్గవి, డి.అనంతరావు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.